క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



ఉదయగిరి: ఉండవల్లిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉదయగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాకర్ల సురేష్ బాబు, ఆయన సతీమణి ప్రవీణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కాకర్లను లోకేశ్ అభినందించారు. ఉదయగిరి అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తొలుత దుర్గమ్మను కాకర్ల కుటుంబ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లోకేశ్‌ను కలిసిన కన్నబాబు



ఆత్మకూరు: ఉండవల్లిలోని నివాసంలో నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గూటూరు కన్నబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

వేమిరెడ్డి, ఆనంకు అభినందనలు



వేమిరెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

ఆత్మకూరు: నెల్లూరు ఎంపీగా, ఆత్మకూరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిని ఆత్మకూరుకు చెందిన బీజేపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని వారి నివాసాల్లో ఇరువురిని కలిసి శాలువాలతో సత్కరించారు. ఆత్మకూరు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆత్మకూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కంది మల్లికార్జునరెడ్డి, సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, జిల్లా వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.



ఆనంను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు సిటీ : నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం నిర్వహించి పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా మూలమూర్తులకు అభిషేకం, ద్వాదశరాధన, ఏకాంత సేవ, విశేష పూజలు జరిపారు. ప్రధానార్చకుడు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయకర్తలుగా నెల్లూరు నగరానికి చెందిన సుబ్బు నరసింహం కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ఆంజనేయునికి సింధూరాలంకరణ



ముత్తుకూరు : స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం వాయుపుత్రుడు సింధూర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీపాల తోరణాలతో శోభాయమానంగా అలంకరించిన ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక శాలివాహన సంఘం ఉభయకర్తగా వ్యవహరించింది.

సేంద్రియ ఎరువు..పంటకు బలం

రసాయన ఎరువుల వినియోగంతో భూములు నిస్సారంగా మారుతున్నాయి. అధిక దిగుబడుల సాధనకు రసాయన ఎరువులను ఎక్కువగా వినియోగించాల్సి రావడంతో పెట్టుబడులు పెరిగి రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారుల సూచనల మేరకు సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారిస్తున్నారు. పంటలకు బలం చేకూర్చే సేంద్రియ ఎరువులైన పచ్చిరొట్ట పైర్లతో పాటు పశువుల వ్యర్థాలతో భూములను సారవంతం చేసుకుంటున్నారు.



పశువుల పేడను ట్రాక్టర్లలో తరలిస్తున్న కూలీలు

సీతారామపురం : రసాయన ఎరువుల వాడకంతో భూములు నిస్సారంగా మారుతున్నాయి. మరో వైపు రసాయన ఎరువులతో పండించే పంట ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో మెట్టప్రాంత రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ పశువుల వ్యర్థాలతో పాటు పచ్చిరొట్టపైర్ల ద్వారా భూసారాన్ని పెంచుకుంటున్నారు. సాధారణంగా పంటలకు ఉపయోగపడే పోషకాలు నేలలో తక్కువగా ఉంటాయి. ఏటా పంటలు పండించడంతో కొద్దిపాటి పోషకాలు తరిగిపోతుంటాయి. నేలలో వాటిని పెంచుతూ అధిక దిగుబడులు పొందాలంటే పశువుల పేడ, వర్మీకంపోస్టు, బయోగ్యాస్ ప్లాంట్ల వ్యర్థాలు, చెరువులు కుంటల్లోని పూడిక మట్టి, పచ్చిరొట్ట వంటి వాటిని వినియోగించాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. రైతులు కొంత కాలంగా తరచూ రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోయి పంటలకు చీడపీడలు సోకి ఉత్పత్తులు తగ్గిపోయి నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను ఇచ్చే సేంద్రియ ఎరువులనే వాడాలని ముందుకు సాగుతున్నారు. పంటల సాగుకు ముందుగా సేంద్రియ ఎరువులను పొలాల్లో వేసి కలియ దున్నుతున్నారు.

సేంద్రియ ఎరువులతో ప్రయోజనాలు

సేంద్రియ ఎరువులతో పొలాలను సారవంతం చేసుకోవడం వల్ల పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందుతాయి. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమిలో తేమశాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోవు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నప్పుడు సేంద్రియ ఎరువులు భూమి పొరలలో ఉండే నీటిని మొక్కలకు అందేలా చేస్తాయి. సేంద్రియ ఎరువులు భౌతిక లక్షణాలను ప్రభావితం చేస్తాయి. ఇసుక నేలల్లో మెత్తని మట్టి శాతాన్ని పెంచడానికి నీటిని పట్టి ఉంచే శక్తి పెంపొందించడానికి దోహదపడతాయి. ఫలితంగా మొక్కలు పరిస్థితులు తట్టుకుని పెరగడానికి వీలు పడుతుంది. వివిధ రకాల రసాయన ఎరువులతో కలిగిన సమస్యలను సేంద్రియ ఎరువుల వాడకంతో పరిష్కరించుకోవచ్చు. నేలలో మొక్కలకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మజీవులుంటాయి. ఈ సూక్ష్మజీవులు వృద్ధి చెందడానికి సేంద్రియ ఎరువులు ఉపయోగపడతాయి. సేంద్రియ ఎరువుల వాడకంతో పంటలకు తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. నాణ్యమైన దిగుబడులు వస్తాయి. సేంద్రియ ఎరువుల్లో అధిక పోషకాలు ఉంటాయి. పశువుల పేడలో నత్రజని 0.5 నుంచి15 శాతం, భాస్వరం 0.3 నుంచి 0.9 శాతం, పొటాష్ 0.5 నుంచి 1.9 శాతం భూమికి అందుతుంది. అలాగే వర్మీకంపోస్టులో నత్రజని 1.6 శాతం, భాస్వరం 0.5 శాతం, పొటాష్ 0.8 శాతం లభిస్తున్నందున రసాయన ఎరువులను తగ్గించి వాడుకోవచ్చు. వీటిని వినియోగించడం వల్ల అధిక దిగుబడులు వచ్చి రైతులకు అదనంగా ఆదాయం సమకూరుతుంది.

ఖర్చు తక్కువ..ప్రయోజనం ఎక్కువ



తక్కువ ఖర్చుతో లభించే సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటలకు ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. రసాయన ఎరువులు వాడకంతో భూసారం తగ్గి పంటలకు తెగుళ్లు సోకి దిగుబడులు పెద్దగా ఉండడం లేదు. రసాయన ఎరువులతో పంట పెట్టుబడులు ఎక్కువవుతాయి. సేంద్రియ ఎరువుల వాడకంతో నాణ్యమైన దిగుబడి వస్తుంది.

–కేశవ, రైతు, సింగారెడ్డిపల్లి

సేంద్రియ ఎరువులు ఎంతో మేలు



సేంద్రియ ఎరువుల వాడకంతో పంటలకు ఎంతో మేలు జరుగుతుంది. పంట పెట్టుబడులు తగ్గుతాయి. పంటలకు తెగుళ్ల బెడద తగ్గి నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉండి లాభాలు పొందవచ్చు.

– చెన్నారెడ్డి, ఏఓ, సీతారామపురం

ఏఎస్‌పేటలో లోపించిన పారిశుధ్యం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో పారిశుధ్యం లోపించింది. పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శి ఎన్నికల కోలాహలం మొదలైనప్పటి నుంచి పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పవిత్ర పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజానాయబ్‌రసూల్ దర్గాకు నిత్యం భక్తులు తరలి వస్తుంటారు. దర్గా ప్రాంతంలో మురుగు రోడ్లపై పారుతూ పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. శుభ్రం చేసే దిక్కులేక రోడ్లపై చెత్త కుప్పలుగా దర్శనమిస్తోంది. దీంతో దర్గాకు వచ్చే భక్తులతో పాటు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వ్యాధుల బారిన పడుతామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

కావలిలో భారీ వర్షం



అల్లూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కావలి : పట్టణంలో గురువారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు, వీధులు జలమయమైన పట్టణ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అల్లూరు: మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం వేళ వాతావరణంలో అనూహ్యంగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ఎండవేడి, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు సేదతీరారు.

నేత్రపర్వం.. కల్యాణోత్సవం



తెప్పపై విహరిస్తున్న ఆది దంపతులు

కోవూరు : బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆది దంపతుల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆది దంపతులను విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. సాయంత్రం పెన్నానదిలో తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి తెప్పపై కొలువుదీర్చి ఉత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆది దంపతులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ గిరికృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆది దంపతుల కల్యాణోత్సవం

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కలిగిరి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీను గురువారం తెలిపారు. 7వ తరగతిలో 15 సీట్లు, 8వ తరగతిలో 8 సీట్లు, 9వ తరగతిలో 9 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శనివారం లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 11న ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సంగం: మండలంలోని సిద్దీపురం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. నెల్లూరులోని రంగనాయకులపేటకు చెందిన రఘు, రాంబాబు మోటార్‌బైక్‌పై మర్రిపాడు మండలం డీసీపల్లికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి నెల్లూరు వెళ్తున్న క్రమంలో సిద్దీపురం వద్ద బైక్ అదుపు తప్పడంతో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు బుచ్చిరెడ్డిపాళెం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

సంగం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో చిన్నారులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలను గురువారం నిర్వహించారు. మే 15 నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగియనుందని లైబ్రేరియన్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. విజేతలకు ముగింపురోజున బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు.

మేత పొరంబోకు ఆక్రమణపై ఫిర్యాదు

అనుమసముద్రంపేట: మండలంలోని చౌటభీమవరం రెవెన్యూ పరిధిలోని మేత పొరంబోకు భూముల ఆక్రమణపై గ్రామస్తులు వీఆర్వోకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 500 ఎకరాల మేత పొరంబోకు భూములు ఉన్నాయని తెలిపారు. ఈ భూములను కొందరు వ్యక్తులు అధికారులను ప్రలోభపెట్టి పట్టాలు చేయించుకుని ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి మేత పొరంబోకు భూములను ఆక్రమణదారుల చెర నుంచి విడిపించాలని కోరారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకుంటే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రామానాయుడికి ఘన నివాళి

నెల్లూరు(బృందావనం) : స్థానిక విజయమహల్ గేట్ సెంటర్ వద్ద ఉన్న సితార కార్యాలయంలో దర్శక నిర్మాత డీ రామానాయుడు జయంతిని గురువారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు డివిజన్ కో–ఆర్డినేటర్ కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో రామానాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లికార్జున్, జయకుమార్, దువ్వూరు బెనర్జీ, శివకుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలను నాటుతున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్

కావలి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ముసునూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీవకోటి మనుగడకు చెట్లే ఆధారమన్నారు. విచ్చల విడిగా చెట్లను నరికేయడంతో పాటు ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. తద్వారా జీవకోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. జీవకోటి మనుగడకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది ఇసకల సాయి ప్రసాద్, లోక్ అదాలత్ మెంబర్ ఎం మాలకొండారెడ్డి, సీడీపీఓ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో..

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ చేతుల మీదుగా ఫైర్‌స్టేషన్ ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. వర్షాకాలంలో మున్సిపాలిటీ తరపున రోడ్ల పక్కన, ఖాళీ స్థలాలు, అటవీప్రాంతంలో సీడ్ బాల్‌లను వెదజల్లుతామన్నారు. సంఘ అధ్యక్షుడు రమణయ్య, సహాధ్యక్షుడు రవికుమార్, ట్రెజరర్ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా -ఇద్దరికి స్వల్ప గాయాలు

వరికుంటపాడు: వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన వరికుంటపాడు బస్టాండ్ సెంటర్‌లో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు..ప్రకాశం జిల్లా పామూరు నుంచి తూర్పుబోయమడుగుకు వస్తున్న ఆటో వరికుంటపాడు బస్టాండ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ ఖాజామస్తాన్‌తో పాటు మరో ప్రయాణికుడు నాగూర్ స్వల్పంగా గాయపడ్డారు. సమీపంలో ఉన్న 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఆటోను రోడ్డుపై నుంచి పక్కకు తొలగించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పేదలకు మెరుగైన వైద్యసేవలు



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి కరీష్మా



సీతారామపురం: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ స్వప్నారెడ్డి

వరికుంటపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు మండల వైద్యాధికారి కరీష్మా పేర్కొన్నారు. మండలంలోని పెద్దిరెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు 48 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి సూచనలు చేశారు. గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి సచివాలయం పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. డాక్టర్ స్వప్నారెడ్డి 105 మందికి బీపీ, షుగర్, రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి ఆరోగ్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, హెల్త్‌అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా అడాల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్

సీతారామపురం : మండలంలో అడాల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. సీతారామపురం, ఒగూరువాండ్లపల్లి, అయ్యవారిపల్లి, దేవిశెట్టిపల్లి, పబ్బులేటిపల్లి, మారంరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో 221 మంది వయోజనులకు వ్యాక్సిన్ వేశారు. క్షయ నియంత్రణలో భాగంగా 60ఏళ్లు పైబడిన వయోజనులకు ముందస్తుగా బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు వైద్యాధికారి స్వప్నారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, ఎంపీహెచ్‌ఈఓ మజీద్, ఎంపీహెచ్‌ఎస్ రియాజ్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతారామపురంలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

329 మందికి అడాల్ట్ బీసీజీ వ్యాక్సిన్

వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 24 గ్రామ పంచాయతీల్లో 329 మందికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను గురువారం వేసినట్లు వైద్యాధికారులు ఆయేషా, కరీష్మా తెలిపారు. బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను వారు పరిశీలించి సిబ్బందికి సూచనలు అందజేశారు. క్షయ నియంత్రణకు వయోజనులకు ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు చెప్పారు. పీహెచ్‌సీ పరిధిలోని వయోజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

ఉదయగిరి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పన సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో గురువారం మలాథిన్‌ను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వాటి కారణంగా మలేరియా, చికున్‌గున్యా, డెంగీ, తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, హెల్త్‌అసిస్టెంట్ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో మలాథిన్‌ను పిచికారీ

కొత్తూరులో పిడుగుపాటు

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు గ్రామంలో పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు కొబ్బరిచెట్టు దగ్ధమైంది. అక్కడ ప్రజలెవరూ లేకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే మండల పరిధిలో చిన్నపాటి వర్షం కురవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడా శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. 450 మంది క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు తెలిపారు. కె.విజయభాస్కర్‌రెడ్డి సౌజన్యంతో పౌష్టికాహారాన్ని అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ గిరినాయుడు, అసోసియేషన్ నిర్వాహకులు ఎస్ రమేష్ బాబు, కె.జయదేవ్, ఎం.నరేంద్రరెడ్డి పాల్గొన్నారు